క్లుప్తంగా

న్యాయ సేవలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న కార్యదర్శి లీలావెంకట శేషాద్రి

కర్నూలు(సెంట్రల్): న్యాయ సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినారాయణ పారాలీగల్ వలంటీర్లకు సూచించారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో పారాలీగల్ వలంటీర్లకు చట్టాలు, న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులను నియమించుకోలేని వారికి న్యాయ సేవా సదన్ ఆధ్వర్యంలో ఉచిత సేవలందిస్తామని, ఈ విశయంపై ప్రజలకు వివరించాలన్నారు.

పర్యాటక అభివృద్ధికి కృషి


ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) డివిజనల్ మేనేజర్ జి.లక్ష్మీనారాయణను ఏపీటీడీసీ ఉద్యోగులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, టూరిజం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఏపీటీడీసీ డిప్యూటీ మేనేజర్ సువర్ణకుమారి, నాయకులు రాజు, అంజనేయులు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

షూటింగ్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక


సౌత్ జోన్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్ల క్రీడాకారులు

కర్నూలు (టౌన్): సౌత్ జోన్ షూటింగ్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ పట్టణంలో నిర్వహించనున్న సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలకు చెందిన ఏపీ జట్లు పాల్గొంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు శుక్రవారం వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులకు క్రీడా దుస్తుల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌత్‌జోన్ స్థాయిలో ప్రతిభ చాటి ఏపీకి పతకాలు సాధించాలన్నారు. జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, అంతర్జాతీయ క్రీడాకారుడు మహమ్మద్ యూసుఫ్ బాష పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ రఘు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు నగరంలోని భగీరథి, డాక్టర్ అబ్రహం లింకన్, సుఖీభవ, విజయ కేర్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ కేంద్రాలను శుక్రవారం జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు సంబంధించిన ధ్రువపత్రాల ను పరిశీలించారు. అనంతరం మిషన్లు, తయారీ కంపెనీ పేర్లు, స్కానింగ్ చేయించుకున్న వారి వివరాలు, వాటి వరుస సంఖ్యను సరిపోల్చి చూశారు. వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలకు అనుగుణంగా స్కానింగ్ నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, దీనిపై పోస్టర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

కాటికాపరుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

కర్నూలు(సెంట్రల్): శ్మశానాల్లో గుంతలు తీసి శవాలను పూడ్చడం, దహనం చేయడం వంటి పనులు చేసే కాటికాపరుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని ఎస్‌జీకేఎస్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాటికాపరులకు ఇళ్లు, కనీస వేతనం ఇవ్వాలన్నారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కాటికాపరుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ మార్చి 10 నుంచి ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కాటికాపరులుగా ఎక్కువగా దళితులే ఉంటుండడంతో వారికి కనీస వేతనంతోపాటు పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, రంగమ్మ, పీఎస్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులం శ్రీగోదా రంగనాయకి సమేత శ్రీరంగనాథ స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, శ్రీగోదా రంగనాథ రామానుజ కూటమి ఛారిటబుల్ ట్రస్టీలు మారం నాగరాజు గుప్త, పల్లెర్ల నాగరాజు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

బడ్జెట్‌లో కార్మికులకు మొండిచెయ్యి


మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు మొండిచెయ్యి చూపారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది కార్మికులు ఉన్నారని, బడ్జెట్‌లో వీరి ప్రయోజనాలను విస్మరించారన్నారు. బడ్జెట్ సవరణ చేసి కార్మికులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో కర్నూలు మండలాధ్యక్షుడు హుసేనయ్య ఆధ్వర్యంలో సీఐటీయూ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ, శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ కార్మికుల ప్రయోజనాలను విస్మరించారన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం సంక్షేమ బోర్డును తెస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట తప్పారని వాపోయారు. హమాలీలు, ఆటో కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించలేదన్నారు. ఆశా వర్కర్ల ప్రస్తావనే లేదని, అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ తమదేనని గొప్పలు చెప్పుకోవడం తప్పా ఏమి చేయలేదన్నారు. కర్నూలులో ఈఎస్ఐ ఆసుపత్రికి స్థలం కేటాయించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నాయకులు రామయ్య, వెంకటరాముడు, రేణుకమ్మ, రమీజాబీ పాల్గొన్నారు.

సైన్స్ ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి


ఆర్‌యూలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు

కర్నూలు కల్చరల్: దేశాభివృద్ధికి తోడ్పడేలా సైన్స్ ఆవిష్కరణలు తయారుచేయాలని రాయలసీమ విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి అన్నారు. భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సర్ సీవీ రామన్ జయంతి పురస్కరించుకొని శుక్రవారం వర్సిటీలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. అప్పుడే పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్.. అన్ని రుగ్మతలకు మందు

కర్నూలు కల్చరల్: సైన్స్ అన్ని రుగ్మతలకు మందు అని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం సోమప్ప కాలనీలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 1930లో సర్ సీవీ రామన్ నోబెల్ బహుమతి సాధించారన్నారు. ఎడ్యుకేషన్‌లో క్రియేటివిటీ, సైంటిఫిక్ టెంపర్ లోపించడంతోనే తరువాత 95 ఏళ్లైనా ఒక్క భారతీయ శాస్త్రవేత్తకు నోబెల్ బహుమతి రాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం యంగ్ సైంటిస్టులకు ఇచ్చే అవార్డులను రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీవీ వర్మ మాట్లాడారు. జాతీయ బీసీ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఫ్లోర్ లీడర్‌గా షేక్ అహ్మద్



కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కౌన్సిల్‌కు ఫ్లోర్ లీడర్‌గా వైఎస్సార్‌సీపీకి చెందిన 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహ్మద్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు 25వ వార్డుకు చెందిన సిత్రా సత్యనారాయణమ్మ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. తాజాగా ఆమె సమ్మతం మేరకు షేక్ అహ్మద్‌ను నియమించినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తా

నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశాల్లో తన వాణిని మరింత బలంగా వినిపిస్తానని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్‌గా నియమితులైన షేక్ అహ్మద్ వెల్లడించారు. తనపై నమ్మకంతో ఫ్లోర్ లీడర్‌గా నియమించిన జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటు పడిందని, వైఎస్సార్‌సీపీ హయాంలో నగరంలో రూ.730 కోట్లు ఖర్చు చేసి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లో టీడీపీ నాయకులు పంచుకో.. తినుకో అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్నారు. పారిశుద్ధ్య నిదులు దుర్వినియోగం అవుతున్నాయని, 200 మంది కార్మికులను నియమించుకున్న టీడీపీ నాయకులు వారు సక్రమంగా వస్తున్నారా.. అన్నది పరిశీలించడం లేదన్నారు.

కుటుంబాలతో సంతోషంగా ఉండండి


గంగాధరప్పను సత్కరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు (టౌన్): పదవీ విరమణ పొందిన అధికారులు కుటుంబాలతో సంతోషంగా గడపాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. శుక్రవారం పదవీ విరమణ పొందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.గంగాధరప్పను స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శాలువా పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణ మోహన్, ఏఆర్ డీఎస్పీ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెడ్ నర్సు వై.కాంతమ్మ పదవీ విరమణను పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంతమ్మను ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి, విమలమ్మ సన్మానించారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 12, 13, 14 తేదీల్లో కర్నూలులో జరిగే సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఉదయం 10 గంటలకు సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమయ్యాయన్నారు. కేంద్రం తెచ్చిన నూతన మోటార్ వెహికల్ యాక్ట్‌తో కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. నాయకులు సాయిబాబా, టి.రాముడు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం


విద్యార్థులు తయారుచేసిన నమూనా ప్రాజెక్టును పరిశీలిస్తున్న హెచ్‌ఎం అరుణశ్రీ

కర్నూలు సిటీ: స్థానిక సర్వేపల్లి విద్యా సంస్థల్లో శుక్రవారం నేషనల్ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కె.పి అరుణశ్రీ ఆధ్వర్యంలో సి.వి రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ నమూనా ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రతిభ


ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ

కర్నూలు కల్చరల్: నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో రాయలసీమ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రతిభ కనబరిచారు. వారిని శుక్రవారం వీసీ వి.వి.బసవరావు అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 20 నుంచి 26వ తేదీ వరకు బెంగుళూరులోని సెయింట్ జోసఫ్స్ ఔట్‌రీచ్ సెంటర్‌లో జరిగిన క్యాంప్‌లో ఆర్‌యూసీఈ నుంచి మేఘన, సాయిలిఖిత, జమీల్‌బీ, ప్రవీణ్, భీరలింగ, హరిబాబు, సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల నుంచి సాయిఅక్షయ, మహమ్మద్ సయీద్ సమీ, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి రాధమ్మ, ఖాదిర్ బాషా ప్రతిభ చాటారని వెల్లడించారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం


నరసింహారెడ్డి నగర్‌లో సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర పరిధిలో కాలనీల్లో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక 46వ వార్డు పరిధిలోని నరసింహారెడ్డి నగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శ్రీనివాససావుతో కలిసి కమిషనర్ పర్యటించి సమస్యలను పరిశీలించారు. పూడికతీత పనులు, ధ్వంసమైన మురుగు కాల్వలు, కేసీ కాలువ వద్ద రక్షణ వలయాన్ని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. తాగునీటి వృథాకు ఆస్కారం లేకుండా తక్షణమే పైపులైన్ కుళాయిల వద్ద లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నెహ్రూ నగర్, పోస్టల్ కాలనీలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

కొనసాగుతున్న నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న సివిల్ సప్లై హమాలీలు

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై హమాలీలకు కూలి రేట్లను పెంచాలని చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారం 8వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా కర్నూలు ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లై హమాలీలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ మాట్లాడుతూ.. హమాలీలకు ఇచ్చే కూలిని రూ.25 నుంచి రూ.28కు పెంచినట్లు ప్రకటించినా అమలు చేయడం లేదన్నారు. అలాగే రెండు జతల దుస్తులతోపాటు బోనస్ ఇవ్వాలన్నారు. హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. హమాలీల సమస్యలను పరిష్కరించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు పీఎస్ రాధాకృష్ణ, రాజు, శివ, వినయ్, ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పరీక్ష ప్రయోగశాలలకు ఫైవ్‌స్టార్ గ్రేడింగ్


వైద్యులు, సిబ్బందిని అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలోని మైక్రోబయాలజీ విభాగం కింద ఉన్న ఐదు హెచ్‌ఐవీ పరీక్ష ప్రయోగశాలలకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) ఫైవ్‌స్టార్ గ్రేడింగ్‌తో కూడిన సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రకటించింది. ఇందులో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఐసీటీసీ, పీపీఐటీసీ ఉన్నాయి. ఈ సందర్భంగా మైక్రోబయాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రేణుకాదేవి, ఆమె బృందం డాక్టర్లు నాగజ్యోతి, విజయలక్ష్మీ, హరిత, శిరీష, చక్రపాణి, ల్యాబ్ టెక్నీషియన్ భాస్కర్, వేణుగోపాల్‌లను సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శుక్రవారం అభినందించారు.

టైలర్లకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

కర్నూలు (అర్బన్): వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న టైలర్లకు అండగా ఉంటామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పెద్దమార్కెట్ సమీపంలోని ఉర్దూ ఘర్ ఫంక్షన్ హాల్‌లో కుట్టుమిషన్ రూపకర్త విలియం హూ జయంతి సందర్భంగా టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీల్ బాషా అధ్యక్షత వహించారు. అతిథి టీజీ వెంకటేష్, కార్మిక శాఖ అధికారి రాంప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టైలర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా డ్రెస్సింగ్ తయారీలో మెలకువలు నేర్చుకోవాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రామకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో చీఫ్ సూపరింటెండెంట్ల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు 'పది' పబ్లిక్, మార్చి 17 నుంచి 28 వరకు 'పది' ఓపెన్, మార్చి 3 నుంచి 15 వరకు ఇంటర్మీడియెట్ ఓపెన్ పరీక్షలు జరగనున్నాయన్నారు. జిల్లాకు సంబంధించి అన్నిటికీ కలిపి 172 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, 40,776 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, ఎగ్జామినేషన్ నోడల్ ఆఫీసర్ చంద్రభూషణ్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మెరిట్ లిస్ట్ రూపొందిస్తాం

కర్నూలు(హాస్పిటల్): నిబంధనల మేరకే పోస్టుల మెరిట్ లిస్ట్ రూపొందిస్తామని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ కాలేజీలు, క్యాన్సర్ హాస్పిటల్‌లలో వివిధ కేటగిరీల పోస్టుల భర్తీ కోసం వచ్చిన నోటిఫికేషన్ల విషయంలో దరఖాస్తు చేసుకున్న వారు ఎలాంటి అపోహలకు గురికావొద్దని, అన్ని పోస్టుల మెరిట్‌లిస్ట్‌లపై వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్నామని, వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి నివృత్తి చేస్తామన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదని, దరఖాస్తుదారులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

భర్త తాగుడు మానలేదని భార్య ఆత్మహత్య

కర్నూలు (టౌన్): మద్యం తాగొద్దని ఎన్నిసార్లు చెప్పినా భర్త వినకపోవడంతో మనస్తాపం చెంది భార్య ఉరి వేసుకొని బలవన్మరణం చెందింది. వివరాలు.. నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆదిత్య నగర్‌లో కమ్మరి పార్థసారధి ఆచారి, నాగలక్ష్మి (40) దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. పార్థసారధి ఆల్‌కేమ్ మెడికల్ కంపెనీలో మేనేజర్‌గా, నాగలక్ష్మి టాటా కంపెనీకి చెందిన క్యారెట్ లైన్ బంగారు షాపులో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తోంది. భర్తకు మద్యం సేవించే అలవాటు ఉంది. అప్పులు చేశా డు. ఇదే విషయంపై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం నాగలక్ష్మి రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం, పాపిరెడ్డి గూడ గ్రామంలో ఉంటున్న అక్క ఇంటికి వెళ్లింది. ఈ నెల 27న భర్తకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు చెప్పింది. రాత్రిఇంటికి చేరుకోగా భర్త మద్యం తాగిఉండటంతో మరోసారి గొడవ పడ్డారు. ఇరువురు వేర్వేరు గదుల్లో పడుకున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో భర్త నీళ్ల తాగేందుకు లేచి చూడగా నాగలక్ష్మి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. ఘటనపై భార్య బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి అక్క కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కొనసాగుతున్న డిగ్రీ ఎస్‌పీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీలో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలకు 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 187 మందికిగాను 140 మంది హాజరుకాగా 47 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పథకాలను పునరుద్ధరించాలి

కర్నూలు(అర్బన్): ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలన్నింటినీ పునరుద్ధరించాలని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కేటాయించిన రూ.345.43 కోట్లను పారదర్శకంగా ఖర్చు పెట్టేలా చూడాలన్నారు. సొంతిల్లు లేని బ్రాహ్మణులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించాలన్నారు. బ్రాహ్మణ యువతకు ఉద్యోగ, ఉపాధి మార్గాలను చూపాలని కోరారు.

పెద్దాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

● వృద్ధుడికి ప్రాణం పోసిన వైద్యులు


ఆపరేషన్ చేయించుకున్న వృద్ధునితో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): ఓ వృద్ధునికి పిత్తాశయంలో ఏర్పడిన అసాధారణ సమస్యను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జనరల్ సర్జరీ విభాగం వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి అతనికి ఆయువు పోశారు. వివరాలను శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయక్ వివరించారు. ఓర్వకల్లుకు చెందిన స్వామన్న(68) తీవ్రమైన వాంతులు, కడుపునొప్పి, బరువు తగ్గడం వంటి లక్షణాలతో ఈ నెల 4న గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో చేరాడు. పరీక్షించిన వైద్యులు ఆయనకు కొలీడోకోడుయోడినల్ ఫిస్టులా (పిత్తనాళం నుంచి ప్రేగులకు ఏర్పడిన అసాధారణ కనెక్షన్) ఉన్నట్లు నిర్ధారించారు. శస్త్రచికిత్స కోసం ఆయనను ఆసుపత్రిలోని జనరల్ సర్జరీ విభాగానికి రెఫర్ చేశారు. అన్ని పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయనకు కొలీడోకోడుయోడినల్ ఫిస్టులాతో పాటు కోలెడొకల్ సిస్ట్ ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ నెల 15న శస్త్రచికిత్స నిర్వహించి ల్యాప్ అధేషియోలైసిస్(అంటుకున్న టిష్యూలను విడదీయడం), ఓపెన్ హెపాటికోజెజునాస్టమి (పిత్త నాళాన్ని చిన్న ప్రేగుతో కలిపే శస్త్రచికిత్స) విజయవంతంగా నిర్వహించారు. పదిరోజుల అనంతరం ఆయన కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ శస్త్రచికిత్సకు సాధారణంగా లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని, కానీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహించామని డాక్టర్ రామకృష్ణనాయక్ తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం గాడిచర్ల హరిసర్వోత్తమ రావు వర్ధంతి నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్, మాజీ చైర్మన్ చంద్రశేఖర కల్కూర, కేజీ గంగాధర్ తదితరులు గాడిచర్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అభివృద్ధికి గాడిచర్ల చేసిన సేవలను కొనియాడారు. విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి గ్రంథాలయ సంస్థకు విరాళంగా ఇచ్చిన వాటర్ ఫిల్టర్, కూలింగ్ మిషన్‌ను ప్రారంభించారు.

20 నుంచి సెపక్‌తక్రా వరల్డ్ కప్

కర్నూలు (టౌన్): బీహార్ రాష్ట్రం పాట్నాలో మార్చి 20 నుంచి 25వ తేదీ వరకు సెపక్‌తక్రా ప్రపంచ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు భారత సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ పోటీలను అఖిల భారత సెపక్‌తక్రా సంఘం, బీహార్ సెపక్ తక్రా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రూ.15 కోట్ల వ్యయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో 40 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. పోటీలను బీహార్ ముఖ్యమంత్రి నితిష్‌కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం


అలంకరణలో మహా గౌరీ


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారయణ స్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య పురస్కరించుకొని మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ, లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీహోమం, రాహుకాల దీప దుర్గా పూజలు విశేషంగా జరిగాయి. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దోమలను నివారించాలి


అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ వైద్య సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని రోజా–2 పట్టణ ఆరోగ్య కేంద్రం 120వ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని వార్డులను సందర్శించి, ప్రజల ఇళ్లలో వారానికోసారి నీటి నిల్వలు పూర్తిగా తొలగించి, దోమల పెరుగుదలను అరికట్టే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ వివరాలను యాప్ అప్‌లోడ్ చేయాలని, ఒకవేళ నీటి నిల్వలు గల ప్రాంతాలను గుర్తిస్తే వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేసి, సంబంధిత సచివాలయ సెక్రటరీ ద్వారా సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం అదే వార్డులో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 3.ఓ సర్వేను తనిఖీ చేశారు. సర్వేలో భాగంగా ఒక్కో బృందం రోజుకు 60 మందికి ఐడీలు జనరేట్ చేయాలని, క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు, రక్తహీనత తదితర అనుమానిత కేసులను గుర్తించి వైద్యాధికారిచే నిర్ధారణ పరీక్షలు చేయించి తదుపరి చికిత్సలు అందించేటట్లు చూడాలన్నారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీవాణి, డెమో శ్రీనివాసులు శెట్టి, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.